క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ మండల కార్యకర్తల సమావేశం

పెనుగంచిప్రోలు: వైఎస్సార్ సీపీ మండల నాయకులు, కార్యకర్తల సమావేశం సోమవారం ఉదయం 10 గంటలకు స్థానిక మునేరు అవతల హరి గార్డెన్స్‌లో నిర్వహిస్తున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు పొన్నం కోటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు తప్పక హాజరు కావాలన్నారు.

ఉద్యోగోన్నతులపై హెచ్‌ఎంలుగా జెడ్పీ హైస్కూళ్లకు బదిలీ



పెనుగంచిప్రోలు: మండలంలో ఉద్యోగోన్నతిపై నాలుగు జెడ్పీ హైస్కూళ్లకు ప్రధానోపాధ్యాయులు బదిలీపై వచ్చారని ఎంఈఓ డి.రవీంద్ర తెలిపారు. వీరిలో పెనుగంచిప్రోలు ఎస్ఎస్‌పీఎం జెడ్పీ హైస్కూల్‌కు ముండ్లపాడు నుంచి నక్కా బాబూరావు, కొణకంచి జెడ్పీ హైస్కూల్‌కు చందర్లపాడు మండలం చందాపురం నుంచి కె.నాగరాజు, శనగపాడు జెడ్పీ హైస్కూల్‌కు కొణకంచి నుంచి అన్నాబత్తుల వెంకయ్య, కొళ్లికుళ్ల జెడ్పీ హైస్కూల్‌కు నందిగామ మండలం అనాసాగరం నుంచి పంతంగి సుబ్రహ్మణ్యస్వామి బదిలీలో వచ్చారు.

గ్రంథాలయాలు పుస్తక భాండాగారాలు



కంచికచర్ల: వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని, గ్రంథాలయాలు పుస్తక భాండాగారాలని గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు పేర్కొన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముందుగా విద్యార్థులకు ఆంగ్లభాషను నేర్పించారు. ఆయన మాట్లాడుతూ, విద్యార్థుల మెదడుకు పదును పెట్టేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. పుస్తకాలు చదవటం, దేశ నాయకుల చరిత్ర తెలుసుకోవటం మంచిదన్నారు. అనంతరం విద్యార్థులకు పలు విభాగాల ఆటలు పాటలు నేర్పించారు. అనంతరం విద్యార్థులకు డ్యాన్స్ నేర్పించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేల్, నీలం సర్వేశ్వరరావు, ఎం.కనకారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

కంచికచర్ల: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుందని ఇన్‌చార్జి తహసీల్దార్ వి.మానస ఆదివారం తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం ప్రజలు అర్జీలు అందజేయాలన్నారు. వచ్చిన అర్జీలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని ఆమె చెప్పారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి

నందిగామరూరల్: రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలని గరికపాడు కేవీకే ఉద్యాన శాస్త్రవేత్త లక్ష్మీకళ పేర్కొన్నారు. వికసిత్ సంలక్ప్ కృషి అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పల్లగిరి, కొండూరు, రామిరెడ్డి గ్రామాల్లో రైతులకు ఆదివారం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ రైతులు ఆధునిక యాంత్రీకరణపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ముఖ్యంగా రసాయనిక ఎరువులు, పురుగు మందులు వినియోగించటం వల్ల దిగుబడులు తగ్గటంతో పాటు సాగు ఖర్చులు అధికంగా ఉంటాయని తెలిపారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా సాగు ఖర్చులు తగ్గటంతో పాటు ఆహార ధాన్యాలపై రసాయనాల ప్రభావం ఉండదని సూచించారు. రైతులు విధిగా మట్టి పరీక్షలు చేయించి లోపాలను గుర్తించి అందుకనుగుణంగా మందులు వినియోగించాలని తెలిపారు. శాస్త్రవేత్తలు జశ్వంత్ రెడ్డి, రాజప్ప, కేవీకే కోఆర్డినేటర్ అచ్యుతరాజు, ఏడీఏ శ్రీనివాస్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై నిరంతర నిఘా



నందిగామటౌన్: రౌడీషీటర్లపై నిరంతర నిఘా ఉంటుందని, అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని సీఐ వైవీఎల్ నాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రౌడీషీటర్లు తీరు మార్చుకుని, సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ముఖ్యంగా వివాదాలు, ఘర్షణలు, శాంతి భద్రలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో మెలిగే వారి రౌడీషీట్ తొలగించేలా ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామన్నారు. అనంతరం వివాదాలు, ఘర్షణలకు దూరంగా ఉంటామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ అభిమన్యు, సిబ్బంది పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలులో ట్రాఫిక్ కష్టాలు

- రోడ్డు మీదకు రావాలంటేనే భయపడుతున్న ప్రజానీకం
- వన్ వే ఏర్పాటు చేయాలంటున్న గ్రామస్తులు



పోలీస్ స్టేషన్ సెంటర్‌లో భారీ వాహనాలతో కష్టాలు

పెనుగంచిప్రోలు: గ్రామంలో శ్రీతిరుపతమ్మవారి ఆలయానికి భక్తులు వేలాదిగా వందల వాహనాల్లో తరలిరావటంతో ఆదివారం గ్రామంలో ట్రాఫిక్ సమస్య తలెత్తింది. సెలవు రోజులు కావటంతో పాటు మొక్కుబడులు తీర్చుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి వేల సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. భక్తుల వాహనాలతో గ్రామంలో అన్ని రోడ్లు నిండిపోయాయి. పోలీస్‌స్టేషన్ సెంటర్ నుంచి ఆలయం వరకు, చెరువుకట్ట, డౌన్ సెంటర్, మునేరు కాజ్‌వే నాలుగు రోడ్లు వాహనాలు నిలిచి పోవటంతో ట్రాఫిక్ నియంత్రిచేందుకు ప్రత్యేకంగా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. పోలీసులతో పాటు వాహనదారులు కూడా ట్రాఫిక్ నియంత్రణలో పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ట్రాఫిక్ రద్దీ కొనసాగింది. వాహనాల రద్దీతో రోడ్డు మీదకు రావాలంటేనే ప్రజలు భయపడిపోతున్నారు. ముఖ్యంగా శుక్ర, ఆదివారాల్లో బైపాస్ మీదుగా వన్‌వే ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. పోలీస్‌స్టేషన్ సెంటర్‌లో రోడ్డు ఆక్రమించి దుకాణాలు ఏర్పాటు చేయటం వలన వాహనాలు తిరిగే పరిస్థితి కూడా లేకుండా పోతోంది. దీనికి తోడు వత్సవాయి మండలం లింగాల కాజ్‌వే మరమ్మతులు కారణంగా వాహనాల రద్దీ మరింత పెరిగింది. తక్షణం అధికారులు ట్రాఫిక్ నియంత్రణపై దృష్టి పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.



ట్రాఫిక్ నియంత్రణలో ఎస్ఐ అర్జున్, సిబ్బంది



విజయవాడ రోడ్డు వైపు నిలిచిపోయిన వాహనాలు



పెనుగంచిప్రోలులో వాహనాల రద్దీ

4న జరిగే వెన్నుపోటు దినం విజయవంతానికి పిలుపు



కంచికచర్లలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అరుణకుమార్



పేటలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

కంచికచర్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్ పిలుపునిచ్చారు. కంచికచర్లలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు వేమా సురేష్‌బాబు కార్యాలయంలో మండల స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తల సమీక్షా సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ మేరకు ఎమ్మెల్సీ అరుణ కుమార్ మాట్లాడుతూ.. ఈనెల 4వ తేదీన నందిగామ నియోజకవర్గ కేంద్రంలో వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అబద్ధపు హామీలతో విజయం సాధించి సంవత్సరం గడిచినా సూపర్ 6 హామీలు అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అవినీతికి కాదేది అనర్హం అన్నట్లుగా వనరులను దోచుకుంటున్నారని దొంగే.. దొంగ అన్న చందంగా తెలుగుదేశం పార్టీ నాయకులు ప్రవర్తిస్తున్నారని అన్నారు. చంద్రబాబు హామీలకు నేను గ్యారంటీ అన్న పవన్‌కళ్యాణ్ ఇప్పుడు హామీలు అమలు చేసే విషయంలో స్పందించటం లేదన్నారు. ప్రత్యర్థి పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని మండిపడ్డారు. పార్టీ నాయకులు, కార్యకర్తల కోసం వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం అండగా ఉంటారని భరోసా కల్పించారు. పార్టీ సంస్థాగతంగా నిర్మాణం చేపట్టామని, త్వరలో పార్టీ సభ్యత్వ నమోదు, కార్యకర్తల ఆరోగ్య బీమా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రానున్న జగనన్న ప్రభుత్వంలో కార్యకర్తలకు సముచిత స్థానం ఉంటుందని, పార్టీ కోసం కష్టపడి పని చేసే వారికి పదవులు దక్కుతాయని తెలిపారు. సమావేశంలో కంచికచర్ల, వీరులపాడు మండల పార్టీ అధ్యక్షులు బండి మల్లికార్జునరావు, ఆవల రమేష్, పట్టణ పార్టీ కన్వీనర్ వేమా సురేష్‌బాబు, ఎంపీపీ షేక్ మలక్ బషీర్, మాజీ ఎంపీపీ పాటిబండ్ల హరిజగన్నాథరావు, మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ కాలవ పెదబాబు, కోటేరు ముత్తారెడ్డి, నాయకులు చింతా రవీంద్రనాథ్, బుడ్డి సత్యనారాయణ, అమర్లపూడి యోహాన్, మంగలపూడి సన్నీ, కోటిబాబు, మార్త శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

చేతులెత్తేసిన కూటమి ప్రభుత్వం..

జగ్గయ్యపేటఅర్బన్: రాష్ట్రంలో అధికారంలోకి రావడం కోసం తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు మోసపూరిత హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు ఆరోపించారు. ఆదివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 4వ తేదీన జరగనున్న వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా ఆయా నియోజకవర్గ కేంద్రాల్లో వెన్నుపోటు దినం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 4 వ తేదీ ఉదయం 10 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయం నుంచి పాత మున్సిపల్ కార్యాలయం కూడలి, నెహ్రూచౌక్, బలుసుపాడు సెంటర్, అప్సరా థియేటర్ రోడ్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు నిరసన ర్యాలీ జరుగుతుందని, అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శిగా శివరాత్రి పృథ్వీరాజ్ నియమితులైనందున పార్టీ కార్యాలయంలో ఆయనను తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు. అలాగే పార్టీ ఎస్సీ విభాగం పట్టణ అధ్యక్షుడిగా పిడమర్తి ప్రభు నియమితులైన ఆయనను తన్నీరు నాగేశ్వరరావు, పార్టీ నాయకులు సత్కరించి అభినందనలు తెలియజేశారు. నూతనంగా నియమితులైన వారు అంకితభావంతో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని తన్నీరు నాగేశ్వరరావు సూచించారు.

హామీలను అమలు చేయని కూటమి సర్కార్

పెద్దాపురం(వీరులపాడు): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తుందని శాసనమండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్ పేర్కొన్నారు. ఈ నెల నాలుగున జరగనున్న వెన్నుపోటు దినం కార్యక్రమానికి సంబంధించి మండలంలోని పెద్దాపురం గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణకుమార్ మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలంటూ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏడాది పూర్తవుతున్నా ఒక్క సిక్స్ కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. నియోజకవర్గ వ్యాప్తంగా నందిగామలోని పార్టీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని కోరుతూ వినతి పత్రం అందజేస్తామన్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, నాయకులు నువ్వుల విశ్వనాథం, మట్టూరి సాయిబాబు, షేక్ షహనాజ్ బేగం, ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యథేచ్ఛగా గ్రావెల్ అక్రమ రవాణా



జగ్గయ్యపేట: మండలంలోని పలు గ్రామాల్లో గ్రావెల్ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. తెలంగాణ సరిహద్దు గ్రామాలైన అన్నవరం, గండ్రాయి, రామచంద్రునిపేట, మల్కాపురం, బూదవాడ గ్రామాల్లో గ్రావెల్‌ను అక్రమార్కులు గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్నారు. ఈ గ్రామాల్లో అటవీ ప్రాంతాలతో పాటు కొండ ప్రాంతాలుండటంతో రాత్రి వేళల్లో గ్రావెల్ అక్రమ రవాణా చేస్తున్నారు. తెలంగాణలో జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతుండటంతో అర్ధ రాత్రి నుంచి తెల్లవారుజాము వరకు గ్రావెల్ తరలిస్తున్నారు. తెలంగాణలో గ్రావెల్‌కు మంచి డిమాండ్ ఉండటంతో ట్రాక్టర్ ట్రక్కు రూ.1,500ల నుంచి రూ.2 వేలు ధర పలుకుతుండటంతో అక్రమార్కులకు హద్దే లేకుండా పోతుంది. అన్నవరంలో ప్రభుత్వ భూమిలో కూడా తవ్వకాలు జరుగుతున్నాయి. సంబంధిత అధికారులు కూడా పట్టించుకోకపోవటంతో అక్రమార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రావెల్ అక్రమ రవాణాపై చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అమ్మవారికి బంగారు ఆభరణాల సమర్పణ



ఆలయ ఏఈఓకు ఆభరణాలు అందజేస్తున్న దాతలు



ఆలయ ఏఈఓకు బంగారు బొట్టుబిళ్ల అందిస్తున్న దాతలు



మంగళ సూత్రాలు



బంగారు బొట్టుబిళ్ల

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారికి ఆదివారం కృష్ణాజిల్లా, మచిలీపట్నంకు చెందిన విజయలక్ష్మి నాలుగున్నర గ్రాముల బంగారు మంగళ సూత్రాలను ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావుకు అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలను అందజేశారు.

బంగారు బొట్టుబిళ్ల బహుకరణ..

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేం చేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారికి ఆదివారం విజయవాడ, చిట్టినగర్‌కు చెందిన కె.శివశంకర్, లక్ష్మీశ్రావణి దంపతులు రాళ్లతో తయారు చేసిన 3 గ్రాముల 700 మిల్లీ గ్రాముల బంగారు బొట్టుబిళ్ల కానుకను అందజేశారు. ఏఈవో తిరుమలేశ్వరరావుకు బొట్టు బిళ్లను అందజేశారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్, పురోహితులు ఆంజనేయశర్మ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో విఘ్నేశ్వరునికి పూజలు



గరికపత్రి పూజలో విఘ్నేశ్వర స్వామి

నందిగామరూరల్: పట్టణంలోని పాత బస్టాండ్‌లో వేం చేసి ఉన్న సిద్ధి, బుద్ధి సమేత విఘ్నేశ్వర స్వామి వారి 11వ వార్షిక కల్యాణ మహోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. వార్షికోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారిని ఆలయ అర్చకుడు రఘుశర్మ ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు, అర్చనలు చేశారు. ముందుగా సుప్రభాత సేవ, మంగళ వాయిద్యాలు, అష్టోత్తర సహస్రనామ పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం విఘ్నేశ్వరునికి ప్రీతికరమైన గరికపత్రితో వేదోక్తంగా పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు అన్నవరపు తిరుపతిరావు, ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపటి నుంచి షిర్డీ సాయి మందిర వార్షికోత్సవాలు

నందిగామరూరల్: పట్టణంలోని చెరువు బజారులో వేం చేసి ఉన్న షిర్డీ సాయిబాబా మందిరం 24వ వార్షిక మహోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త తమ్మవరపు మల్లికార్జునరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 3 నుంచి 6వ తేదీ వరకు వార్షిక మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 3వ తేదీన సుప్రభాత సేవ, కాగడ హారతి, గణపతి పూజ, అఖండ ప్రతిష్ఠాపన, మండపారాధన, చండీ సహిత రుద్రహోమం, పల్లకి సేవ అనంతరం రాత్రికి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. అదే విధంగా 4న స్వామి వారికి సుగంధ ద్రవ్యాలతో మహాన్యాస పూర్వక ఏకాదశ కలశాభిషేకం, సామూహిక అభిషేకాలు, మూలమంత్ర హోమాది క్రతువులు, లక్ష మల్లెలార్చన, సహస్ర దీపోత్సవం, 5న బాబా వారికి పలు రకాల పండ్ల రసాలతో అభిషేకం, అన్నాభిషేకం, కనకాభిషేకం, పూర్ణాహుతి పూజలు జరుగుతాయని తెలిపారు. శివ పార్వతుల శాంతి కల్యాణోత్సవం అనంతరం భారీ అన్నప్రసాద వితరణ నిర్వహిస్తామన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని వార్షికోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

సర్వర్ల మొరాయింపుతో రేషన్ కష్టాలు



భీమవరంలో క్యూలో ఉన్న కార్డుదారులు



వేములనర్వలో సర్వర్ ఆగడంతో వేచి ఉన్న కార్డుదారులు



పెనుగంచిప్రోలులో ఎర్రర్ చూపుతున్న మిషన్

జగ్గయ్యపేట: రేషన్ కార్డుదారులకు చౌక డిపోల వద్దనే నిత్యావసర సరుకులు తీసుకునే కార్యక్రమాన్ని ఆదివారం కూటమి ప్రభుత్వం ప్రారంభించటంతో మొదటి రోజు సర్వర్‌ల మొరాయింపుతో డీలర్‌లు, కార్డుదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి రేషన్ పంపిణీ ప్రారంభించారు. నియోజకవర్గంలోని పెనుగంచిప్రోలు, వత్సవాయి, జగ్గయ్యపేట మండలాల్లోని రేషన్ దుకాణాల్లో సర్వర్‌లు మొరాయించటంతో డీలర్లు ఖాళీగా కూర్చోవాల్సి వచ్చింది. నియోజకవర్గంలో మూడు మండలాలతో పాటు పేట మున్సిపాలిటీలో 130 రేషన్ దుకాణాలుండగా 53,219 రేషన్ కార్డులున్నాయి. బియ్యం, పంచదార మాత్రమే రేషన్ దుకాణాల్లో ఇవ్వటంతో సర్వర్‌లు పని చేయక ఇబ్బందులు పడ్డారు. గతంలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటింటికీ పంపిణీ చేశారని ఎండ వేడిమి, ఉక్కపోతకు వెళ్లలేక పలువురు కార్డుదారులు దుకాణాలకు వెళ్లని దుస్థితి నెలకొంది. జగ్గయ్యపేట మండలంలో మల్కాపురం, అనుమంచిపల్లి, గౌరవరం, పోచంపల్లి గ్రామాలలో మధ్యాహ్నం వరకు సర్వర్‌లు పని చేయకపోవటంతో అరకొరగానే ప్రజలు సరుకులు తీసుకున్నారు. పెనుగంచిప్రోలు మండలంలో ఉదయం నుంచే డీలర్లు రేషన్ కార్డుదారుల కోసం వేచి ఉండగా కార్డుదారులు వచ్చిన సమయంలో సర్వర్‌లు పని చేయకపోవటంతో వెనుదిరిగారు. ఇదిలా ఉండగా రేషన్ దుకాణాలను కూటమి నాయకులు ప్రారంభించారు. జగ్గయ్యపేట పట్టణంలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, చిల్లకల్లులో ఎమ్మెల్యే సోదరుడు శ్రీరాం చిన్నబాబులు ప్రారంభించటంతో పాటు ఆయా గ్రామాలలో కూటమి నాయకులే దుకాణాలను ప్రారంభించటం విశేషం.

రేషన్ షాపుల వద్ద క్యూ కట్టిన కార్డుదారులు

వత్సవాయి: గత ప్రభుత్వం రేషన్ కార్డుదారులకు సరుకులను ఇంటింటికీ ఇచ్చే పథకం ఎండీయూను కూటమి ప్రభుత్వం రద్దుచేసింది. జూన్ నెల నుండి మరలా కార్డుదారులు రేషన్‌షాపుల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితులు వచ్చాయి. ఆదివారం ఉదయం 8 గంటలకే కార్డుదారులు రేషన్‌షాపుల వద్దకు చేరుకున్నారు. వత్సవాయిలో రేషన్‌షాపును తహసీల్దార్ కె.ప్రభుకుమార్ ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో తెలుగుదేశం నాయకులు ప్రారంభించిన తరువాత రేషన్ సరుకులను పంపిణీ చేశారు. రేషన్ పంపిణీ ప్రారంభించిన కాసేపటికే సర్వర్ మొరాయించడంతో పంపిణీ నిలిచిపోయింది. దీంతో కార్డుదారులు అక్కడే నిలిచిపోయారు. మరలా కాసేపటి సర్వర్ రావడంతో సరుకులను అందించారు. అక్కడే సరుకుల కోసం నిలబడి ఉండడంతో కార్డుదారులు విసుగుచెందారు. మండలంలో 20,423 కార్డుదారులున్నాయి.

రేషన్ షాపు ప్రారంభం

జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని కాకానినగర్‌లో ఉన్న రేషన్ షాపును స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే తాతయ్య ప్రారంభించారు. తహసీల్దార్ మనోహర్, డీటీ వెంకటేశ్వరరావు, కౌన్సిలర్ కొలగాని రాము, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డీలర్లు సమయపాలన పాటించాలి..

నందిగామటౌన్: రేషన్ డీలర్లు విధిగా సమయపాలన పాటించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. పట్టణంలోని 44వ రేషన్ దుకాణాన్ని, అడవిరావులపాడు గ్రామంలోని రేషన్ దుకాణాన్ని ఆమె ప్రారంభించారు. ఆర్డీవో బాలకృష్ణ, తహసీల్దార్ సురేష్ బాబు, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కల్యాణ వెంకటేశ్వరస్వామికి మల్లెల అలంకారం



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణ సమీపంలోని విశాఖపట్నం లైమ్ స్టోన్ మైన్స్ క్వార్టర్స్ ప్రాంగణంలో ఉన్న శ్రీభూసమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో స్వామి వారికి మల్లె పూలతో ప్రత్యేక అలంకారం చేశారు. ఈ సందర్భంగా ఆదివారం వీఎస్పీ పూర్వ ఉద్యోగి పీఆర్కే రాజు, హేమలత దంపతుల ఆర్థిక సహాయంతో స్వామి వారికి మల్లెపూలతో ప్రత్యేక అలంకారాన్ని, పూజలను నిర్వహించారు. జగ్గయ్యపేట లైమ్ స్టోన్ మైన్స్ ఇన్‌చార్జ్ కిరణ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఆలయ అర్చకులు టీఎల్ఎస్ ఆచార్యులు, కృష్ణ భరద్వాజ్‌ల పర్యవేక్షణలో పూజలు చేశారు. వీఎస్పీ ఉద్యోగులు జేవీఎస్.ప్రసాద్, సూర్యనారాయణరాజు, ఆంజనేయులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నందిగామరూరల్: అనాసాగరం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సోమవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏడీఈ స్టాలిన్ కుమార్ ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాసాగరం 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని 11 కేవీ హౌసింగ్ కాలనీ ఫీడర్ మీద విద్యుత్ వైర్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించటంతో పాటు లైన్ల మరమ్మతు పనులు చేపడుతున్నామన్నారు. దీని కారణంగా ఉమా కాలనీ, డీవీఆర్ కాలనీ, బైపాస్ రోడ్డు తదితర ప్రాంతాలలో ఉదయం 7 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని ఆయన కోరారు.

వైభవంగా ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు



జగ్గయ్యపేటఅర్బన్: పట్టణంలోని శ్రీసీతారామస్వామి ఆలయం(పెద్ద రామాలయం) పునః ప్రతిష్ఠా మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా రెండో రోజైన ఆదివారం ఉదయం కర్మాంగ స్నపనం, నయనోన్మీలనం, స్వామి వారికి పంచామృత అభిషేకాలు, సాయంత్రం శయ్యాదివాసం, తత్వన్యాసయన హోమం, గర్త పూజ రత్న న్యాసం, యంత్ర బింబ స్థాపన తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య), టీడీపీ నాయకులు శ్రీరాం చిన బాబు, నూకల కుమార్ రాజా, శ్రీరాం కృష్ణ పవన్, రామాలయం భక్త బృందం, ఆలయ కమిటీ సభ్యులు పేరూరి కోటేశ్వరరావు, దేవరకొట్టి రామకృష్ణ, ఆయన సోదరులు, ఆలయ శాశ్వత ధర్మకర్తలు తుమ్మేపల్లి నరేంద్ర, ఆయన సోదరులు పాల్గొన్నారు.